

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,8 ఆగస్టు 2025

8 పేజీలు


### మార్కెట్ యార్డుల్లో

## డిజిటల్ వసూళ్లు

- వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్ పోస్టుల వద్ద డిజిటల్ చెల్లింపులకు శ్రీకారం
- నగదు వసూళ్లకు బదులుగా ఇకపై ఈ-పాస్ యంత్రాల ద్వారా డిజిటల్ రసీదులు
- రాష్ట్రవ్యాప్తంగా తొలిసారిగా తూర్పుగోదావరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టు
- పెరవలి చెక్ పోస్ట్ వద్ద డిజిటల్ విధానం ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి



**పెరవలి,మేజర్‌న్యూస్ :** వ్యవసాయ మార్కెట్ కమిటీల చెక్ పోస్టుల వద్ద అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ విధానంలో మార్కెట్ ఫీజులు వసూలు చేసే దిశగా పటిష్ట చర్యలు చేపట్టింది. తద్వారా మార్కెట్ రుసుం వంద శాతం సాధించేలా ఎస్‌బీఐ బ్యాంకు సహకారంతో అమలు చేస్తున్న ఈ పైలట్ ప్రాజెక్టును తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పెరవలి మండలం చెక్ పోస్టు వద్ద రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్,జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, ఐ.ఏ.ఎస్‌లు సంయుక్తంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఈ-పాస్ యంత్రం ద్వారా డిజిటల్ చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ యార్డు తనిఖీల్లో ఈ విధానం అమల్లోకి వస్తుందని వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు మార్కెటింగ్ తనిఖీ కేంద్రాల వద్ద నగదు రూపంలో వసూలు చేయబడుతున్న మార్కెట్ ఫీజును పక్కనబెట్టి ఇకపై పూర్తిగా డిజిటల్ విధానంలో,తగినరసీదుతోనే వసూలు చేయనున్నామన్నారు. తద్వారా పారదర్శకత పెరగడంతో పాటు మార్కెట్ కమిటీల ఆదాయం కూడాపెరగనుందని కూటమి ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఆలోచన, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధానం, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రోత్సాహంతో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టడం

- తరువాయి 2లో..

### మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావడానికి

## ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వనమాడి కొండబాబు
- మత్స్యకార కుటుంబాలకు ఆర్ధిక సహాయం, నిత్యావసర వస్తువుల పంపిణీ



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** శ్రీలంక సముద్రజలాల్లో పట్టుబడిన మత్స్యకారులను సురక్షితంగా వారిస్వస్థలాలకు త్వరితిగతిన తీసుకు రావడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేయడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు.శ్రీలంక సముద్రజలాల్లో పట్టుబడిన4మత్స్యకార కుటుంబాలకు గురువారం స్థానిక జగన్నాధపురం

- తరువాయి 2లో..


### సినీ ఫక్కీలో సచివాలయం

## ఉద్యోగిని కిడ్నాప్ !

- ఆచూకీ కోసం పోలీసులు ముమ్మర గాలింపు

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో సినీ ఫక్కీలో ఒక గ్రామ సచివాలయం ఉద్యోగిని కిడ్నాప్ ఘటన సంచలనం రేపింది. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం శరభవరం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సోయం సౌమ్యను గుర్తు

- తరువాయి 2లో..





## చేనేత కార్మికులకు అండగా ఉంటా

- కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న వేలాది కుటుంబాలకు అండగా ఉండడంతో పాటు, కార్మికుల సంక్షేమంకోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు ప్రతి లబ్ధిదారుడికి చేరేందుకు తనవంతు కృషిచేస్తానని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సూచనల మేరకు పిఠాపురం నియోజవర్గం యు.కొత్తపల్లి గ్రామంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు రావు అక్షయ్ నేతృత్వంలో పార్టీ నాయకులు స్థానిక చేనేత సంఘాల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చేనేత కార్మికుల సంక్షేమం, నిధుల కోసం ఇటీవల పార్లమెంట్

- తరువాయి 2లో..

### జాబ్ మేళా అవకాశాలను

## అభ్యర్థులు సీరియస్‌గా తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లాలో నిర్వహిస్తున్న జాబు మేళాల అవకాశాలను అభ్యర్థులు సీరియస్‌గా తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. గురువారం వికాస ఆధ్వర్యంలో కాకినాడ ఇంద్రపాలెం ఐడియల్ కళాశాలలో కాకినాడ పట్టణ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు సహకారంతో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు జిల్లా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కాకినాడ ఎమ్మెల్యే

- తరువాయి 2లో..




# మార్కెట్ యార్డుల్లో డిజిటల్ వసూళ్లు

మొదటిపేజి తరువాయి

సంతోషంగా ఉందన్నారు. డబ్బులు పక్కదారి పట్టకుండా కూటమి ప్రభుత్వం ప్రతి రంగంలో యాప్‌ల ద్వారా ప్రజలకు సౌలభ్యంతో కూడిన డిజిటల్ విధానాన్ని ప్రవేశపెడుతోందన్నారు. తద్వారా డేటాసేకరణ సులువవుతుంది అన్నారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయ రంగ అభివృద్ధికి డిజిటల్ మార్గాలు అందుబాటులోకి రావడంచాలా సంతోషకరమైన విషయమని అభివర్ణించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వం మద్యం విక్రయాలు కేవలం నగదు ద్వారా మాత్రమే జరిపి భారీ కుంభకోణం చేసిందన్నారు. అంతేగాక గత ప్రభుత్వం చేపట్టిన విధానాలతో కల్తీ సారా తాగి జంగారెడ్డి గూడెంలో 23 మంది చనిపోయిన ఘటనను గుర్తుచేశారు. ప్రస్తుతం అలాంటి విధానాలకు తాము చెక్ పెట్టామన్నారు. ప్రతి ఒక్క కార్యక్రమం పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో అన్ని చోట్ల డిజిటల్ చెల్లింపుల విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఏఐ, క్వాంటం టెక్నాలజీ లాంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించి పాలనలో విప్లవాత్మక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. వసూళ్లలో చేతివాటం ప్రదర్శించిన అక్రమార్కులను చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. వారి నుండి తిరిగి వసూలు చేసే కార్యక్రమ కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఈ సందర్భంగా అందరికీ అందుబాటులోకి తెచ్చిన కలెక్టర్ పి. ప్రశాంతిని, జిల్లా అధికార యంత్రాంగాన్ని మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన ఈ విధానంతో మార్కెట్ యార్డుల ఆదాయానికి గండి పడకుండా రుసుం లక్ష్యాలను వంద శాతం చేరుకునేందుకు వీలుంటుందని అన్నారు. మార్కెట్ రుసుం లక్ష్యాలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. నకిలీ రసీదులతో చేతివాటం ప్రదర్శిస్తున్న వారికి చెక్ పడుతుందన్నారు. అంతకుముందు పెరవలి చేరుకున్న మంత్రి కందుల దుర్గేష్ కు స్థానిక నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఏడి మార్కెటింగ్ మరియు పెరవలి మండలం ప్రత్యేక అధికారి సునీల్ వినయ్, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ కె హరిబాబు, డిడి పి. పాపారావు, తాసిల్దార్ కే నిరంజన్, ఎంపీడీవో గంటా శ్రీనివాస్, ఇతర అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులు, ఎంపీపీ కార్చెర్ల సీతారాం ప్రసాద్, పెరవలి సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసెఫ్, కూటమి నాయకులు అతికాల కృష్ణమ్మ, పెప్పర రవికుమార్, భూపతి రాజు రవివర్మ, కోల సీతయ్య నాయుడు, నందిప శ్రీనివాస చక్రవర్తి, కోటిపల్లి మురళీకృష్ణ, బొడ్డు రామాంజ నేయులు, పువ్వల సదాశివ గోపి, రాంబాబు, తెదేపా, జనసేన, బిజెపి, నాయకులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులకు అండగా ఉంటా

మొదటిపేజి తరువాయి

సమావేశాల్లో గళమెత్తిన సందర్భంగా ఎంపీ ఉదయ శ్రీనివాస్‌కు సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాన్ని స్థానిక నాయకులకు అందించి, వీటిపై చర్చించేందుకు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్‌తో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరగా, ఇదే విషయాన్ని స్థానిక జనసేన నాయకులు ఢిల్లీ పర్యటనలో ఉన్న ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత చేనేత సంఘాల నాయకులతో సమావేశమై అన్ని అంశాలు చర్చిస్తానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

## నడిపల్లి అంగన్వాడి సెంటర్లో తల్లిపాలు వారోత్సవాలు



**పెరవలి, మేజర్ న్యూస్ :** నడిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గల 49, 50,51,అంగన్వాడి సెంటర్ల నందు ఆగస్టు 7వ తేదీ గురువారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్ బీర.సత్యవేణి రాజు హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి యొక్క పాలు ఫీడ్ ఇవ్వడం ద్వారా రోగ నిరోధక శక్తి పెంపొందించి అవకాశం కలుగుతున్నది అని వచ్చిన తల్లులకు వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ వి. సరోజినీ, టీచర్స్ మంగాదేవి, సత్తార్ బీ, భవాని, మరియు బాలింతలు పాల్గొన్నారు.

## వార్మింగ్ డే పోస్టర్ ఆవిష్కరణ



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** గండేపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ అధ్యక్షులు చలగళ్ల పద్మనాభుడు (దొరబాబు) వారిచే "నేషనల్ డీ వార్మింగ్ డే" పోస్టర్ ను ఆవిష్కరించి, డీ వార్మింగ్ మాత్రలైన ఆల్బెండజోలమ్ మాత్రలను ఏఎన్ఎం లకు అందజేయడం జరిగింది. ఈ నెల 12 వ తేదీన ఈ మాత్రలను ఏఎన్ఎంలు మరియు ఆశ వర్కర్లు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి 6397 మంది విద్యార్థులకు మరియు అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు మధ్యాహ్నం భోజనం తర్వాత వేయడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె.చంద్రరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గండేపల్లి మెడికల్ ఆఫీసర్ నరేష్, మండల విద్యాశాఖాధికారి కె.హున్యా నాయక్ మరియు ఏఎన్ఎం లు పాల్గొనడం జరిగినది.

## జాబ్ మేళా అవకాశాలను అభ్యర్థులు సీరియస్‌గా తీసుకోవాలి

మొదటిపేజి తరువాయి

కొండబాబు, ముఖ్య అతిథులుగా హాజరై మెగా జాబ్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ ఈ జాబ్ మేళాను విజయవంతం చేసేందుకు గత వారం రోజులుగా శాసనసభ్యులు వారి బృందం అహర్నిశలు శ్రమించారన్నారు. వికాస టీమ్, మరియు ఇతర ప్రజాప్రతినిధులకు జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు అభినందనలు తెలియజేశారు. అనేక వ్యయ ప్రయాసలతో ఈ జాబు మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. నిజంగా ఉద్యోగం అవసరం ఉండి ఆసక్తి ఉన్నవారే ఈ జాబ్ మేళాలలకు హాజరు కావాలన్నారు. కేవలం టైం పాస్ కోసమో, సరదా కోసమో కాకుండా, నిజంగా ఉద్యోగం చేయాలనే ఆసక్తి, అవసరం ఉన్నవారు మాత్రమే జాబ్ మేళాలకు రావాలని ఆయన కోరారు. హైదరాబాదు, చెన్నై వంటి నగరాల్లో ఉద్యోగం వస్తే వెళ్ళడానికి సిద్ధంగా లేనివారు, కేవలం ఇంటర్వ్యూ అనుభవం కోసం వచ్చి ఇతరుల అవకాశాలను దెబ్బతీయవద్దని జిల్లా కలెక్టర్ స్పష్టంగా సూచించారు. అనవసరంగా సంఖ్యను పెంచి, జాయిన్ కాని వారి వల్ల కంపెనీల సమయం, నిర్వాహకుల శ్రమ వృధా అవుతుందన్నారు. ఇది తమ తోటి స్నేహితులు, కొలీగ్స్ భవిష్యత్తుకు సంబంధించిన విషయమని అభ్యర్థులు గుర్తించాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించి, బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కాకినాడ పట్టణం శాసనసభ్యులు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి అనేక జాబు మేళాలు నిర్వహించడం జరిగిందన్నారు. గత 2014 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ హయంలోనే కాకినాడలో వికాస సంస్థ ప్రారంభమైందని ఆయన గుర్తు చేశారు. అప్పటినుంచి ఆ సంస్థ ద్వారా సుమారుగా 1.50 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. కాకినాడ పట్టణంలోని నిరుద్యోగ యువకులు ఇటువంటి జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందుకోవాలని ఆయన తెలిపారు. భవిష్యత్తులోను కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇటువంటి మెగా జాబు మేళాలు మరిన్ని వికాస ద్వారా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండబాబు తెలిపారు.

వికాస పీడి కె.లచ్చారావు మాట్లాడుతూ కాకినాడ ఐడీల్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 35 కంపెనీల ప్రతినిధులు హాజరవ్వడం జరిగిందన్నారు. 1200 ఉద్యోగులకు నిర్వహించిన ఈ జాబ్ మేళాలు 1150 మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొనడం జరిగిందని ఆయన తెలిపారు. వివిధ కంపెనీలకు ఎంపికైన 648 అభ్యర్థులకు కాకినాడ ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ చేతుల మీదుగా నియమక పత్రాలు అందజేయడం జరిగిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఐడీల్ కళాశాల ప్రిన్సిపల్ టీ.సత్యనారాయణ, కరస్పాండెంట్ పీఎస్ఎస్.కిరణ్, డైరెక్టర్ ఎం.రంజిత్, వికాస సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యకారులను సురక్షితంగా తీసుకురావడానికి ప్రభుత్వం కృషి

మొదటిపేజి తరువాయి

శాసనసభ్యులు వారి స్వగృహం నందు ఆర్థిక సహాయం మరియు నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈసందర్భంగా కొండబాబు మాట్లాడుతూ కాకినాడ నగరానికి చెందిన పంతాడి బ్రహ్మానందం 40 లక్షలతో కేరళ నందు ఫిషింగ్ ఫైబర్ బోటును కొని రామేశ్వరం మీదుగా కాకినాడకు తీసుకువచ్చే సమయంలో జిపిఎస్ పరికరం సాంకేతిక లోపంతో ఆగస్టు 4వ తేదీన శ్రీలంక సముద్ర జలాల్లోకి చేరడంతో శ్రీలంక కోస్ట్ గార్డ్ సిబ్బంది ఫైబర్ బోటును మరియు బోటులో ఉన్న మత్స్యకారులు పంతాడి బ్రహ్మానందం, చింతా నాగేశ్వరరావు, కర్రీ నూకరాజు, కోప్పడి శ్రీనులను వారి అదుపులోకి తీసుకోవడం జరిగిందని,సమాచారం తెలిసిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, సమాచారం తెలుసిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి శ్రీలంక అధికారులతో సంప్రదింపులు జరపడం జరిగిందని, మత్స్యకారులను త్వరలోనే సురక్షితంగా కాకినాడకు తీసుకురావడం జరుగుతుందని, నేడు శ్రీలంక సముద్రంలో చిక్కుకున్న మత్స్యకార కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని కల్పించి ఒక్కొక్క కుటుంబానికి 20,000 వేలు చొప్పున 4కుటుంబాలకు 80,000 రూపాయల చెక్‌లను మరియు నిత్యవసర వస్తువులను అందించడం జరిగిందని కొండబాబు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ వి. కృష్ణారావు, అసిస్టెంట్ డైరెక్టర్ కే. కరుణాకర్, ఎఫ్‌డివో జి.గోపి, కే.ప్రకాష్, బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులు బలసాడి రంగారావు, సంఘాని నాగేశ్వరరావు, మల్లాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సినీ ఫక్కీలో సచివాలయం ఉద్యోగిని కిడ్నాప్ !

మొదటిపేజి తరువాయి

తెలియని వ్యక్తులు గురువారం కిడ్నాప్ చేసారు. శరభవరం గ్రామ సచివాలయంలో విధులలో ఉండగానే మాస్క్ ధరించిన గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సోయం సౌమ్యను కార్యాలయం నుండి బయటకు లాక్కొచ్చి ఇన్నోవా వాహనంలో ఎత్తుకెళ్లారు. కిడ్నాప్ జరిగిన సమయంలో వాహనంలో సుమారు ఆరుగురు వ్యక్తులు మాస్కులు ధరించి ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. గ్రామ సచివాలయం ఉద్యోగిని సౌమ్య, కశింకోట అనిల్ (కిడ్నాపర్‌లలో ఒకరు) మధ్య గతంలో ఉన్న ప్రేమ వ్యహారమే కిడ్నాప్‌కు కారణంగా తెలుస్తోంది. అంతేకాకుండా ఆర్థిక సంబంధ వ్యవహారాలు ఏమైనా ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు ఎంక్వైరీ జరుగుతుంది. వాహనం ఎటువైపు వెళ్లిందో సీసీ కెమెరాలు ఆధారంగా పోలీసులు ముమ్మర తనిఖీ చేస్తున్నారు. వీరు ఇద్దరు గతంలో ఒకసారి పారిపోగా అప్పుడు దేవీపట్నం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి వారిని తీసుకొచ్చి తల్లితండ్రులకు అప్పగించ్చారు. ఈ ఘటనపై దేవీపట్నం పోలీసులు కేసు నమోదు చేసి కిడ్నాపర్‌ల కోసం ముమ్మరంగా గాలింపు చేపట్టారు. రంపచోడవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన సోయం శ్రీసౌమ్య శరభవరం గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కిడ్నాపర్ కశింకోట అనిల్ మారేడుమిల్లి మండలం వెటుకూరు గ్రామానికి చెందిన వ్యక్తి కాగా కొంతమంది వ్యక్తులతో కలిసి కిడ్నాప్ పాల్పడినట్లు తెలుస్తుంది.

**ఏజెన్సీలో కిడ్నాప్ కలకలం..**

సచివాలయం ఉద్యోగిని కిడ్నాప్ సినిమా ఫక్కీలో జరిగింది. దేవీపట్నం మండలంలో పట్ట పగలే కిడ్నాప్ వ్యవహారం తీవ్ర కలకలం లేపింది. శరభవరం గ్రామ సచివాలయంలో పట్ట పగలే అందరూ చూస్తుండగా సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీసౌమ్యను గుర్తు తెలియని దుండగులు బలవంతంగా సినిమా ఫక్కీలో ఇన్నోవా కారులో ఆపహరించుకుపోవటం కలకలం రేపింది. ఈ సంఘటన తొమ్మిది గంటల సమయంలో విధి నిర్వహణలో ఉండగా జరగటం అక్కడ ఉన్న వారిని భయాందోళనకు గురి చేసింది. ఇంకా కొందరు డ్యూటీకి వస్తున్నారు.

ఆ పక్కనే రోడ్డు జనం అటు ఇటు తిరుగుతు న్నారు. ఇంతలో కారు రావటం సౌమ్యను కార్‌లో ఎక్కుంచుపోవడం జరిగింది. సౌమ్యను కిడ్నాప్ అవసరం ఏమొచ్చింది తెలియవలసి ఉంది. కారులో వచ్చింది ఎవ్వరు, పట్టపగలే సౌమ్యను ఎందుకు కిడ్నాప్ చేయాల్సి వచ్చింది. ఇంతకుముందు అదే సచివాలయంలో పని చేసే మరో ఉద్యోగికి ఇలాగే జరిగింది. రంపచోడవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో దేవీపట్నం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# పలువురికి జెఎన్టీయుకె 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డులు





కాకినాడ, మేజర్ న్యూస్ : నిపుణుల బృందం సిఫార్సు మేరకు కె.వెంకటేశ్వరరెడ్డి, ఏ.అశోక్‌కుమార్, కె.సరితారాజ్, వి.కృష్ణ ప్రసన్న మరియు ఎల్.ప్రసాదరావులు సమర్పించిన సిద్ధాంత వ్యాసాలు జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందాయి. కె.వెంకటేశ్వరరెడ్డి, ఏ.అశోక్‌కుమార్, కె.సరితారాజ్‌లకు ఈసిఈ విభాగంలోను, వి.కృష్ణ ప్రసన్న, ఎల్.ప్రసాదరావు లకు మేనేజ్‌మెంట్ విభాగంలో పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డులు లభించాయి. కె.వెంకటేశ్వరరెడ్డి సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'ఎఫీషియంట్ వివిఎల్ఎస్ఐ ఇంప్లిమెంటేషన్ ఫర్ న్యూరోమార్ఫిక్ కంప్యూటింగ్'ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.ఎన్.బాలాజీ గారి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించగా ఏ.అశోక్‌కుమార్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'డిజైన్ ఆఫ్ లో పవర్ అండ్ హై స్పూరియస్ ఫ్రీ డైనమిక్ రేంజ్ కరెంట్ స్టీరింగ్ డిజిటల్ టు అనలాగ్ కన్వర్టర్'ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.ఎన్.బాలాజీ గారి ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించగా కె.సరితారాజ్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'డిజైన్ అండ్ ఇంప్లిమెం టేషన్ ఆఫ్ ఏ కాప్రిసియస్ డిజిటల్ ఎఫ్ఐఆర్ ఫిల్టర్ యూజింగ్ బాగ్-వూకి మల్టీప్లైర్ అండ్ రివర్సబుల్ యాడర్ ఫర్ ఈసిజి నాయిస్ రిమూవల్ ఇన్ బయో- మెడికల్ అప్లికేషన్స్'ను విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.పి.రాజేష్‌కుమార్ మరియు విజయనగరంలోని ఎంవిజిఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా. ఎం.సత్యనారాయణ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించగా శ్రీ వి.కృష్ణ ప్రసన్న సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'ఏ స్టడీ ఆన్ ఇన్వెస్టర్స్ పెర్సప్షన్ అండ్ అవేర్‌నెస్ టువార్డ్స్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఇన్ కృష్ణా డిస్ట్రిక్ట్, ఆంధ్ర ప్రదేశ్'ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ మాజీ డైరెక్టర్ & హెచ్ఎస్ఎస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా.పి.విజయకుమార్ మరియు కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) డా. పి.వి.వి.సత్యనారా యణ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించగా ఎల్.ప్రసాదరావు సమర్పించిన సిద్ధాంత వ్యాసం 'ఏన్ అసెస్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ క్యాపిటల్ అండ్ పెర్ఫార్మెన్స్ ఆఫ్ బ్యాంకింగ్ ఇండస్ట్రీ విత్ రిఫరెన్స్ టు శ్రీకాకుళం డిస్ట్రిక్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్'ను కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ మాజీ డైరెక్టర్& హెచ్ఎస్ఎస్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డా.పి.విజయకుమార్ మరియు కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్) డా. బి.చార్వక్ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# సోదరి సోదరులు మధ్య అనుబంధానికి గుర్తు "రక్షాబంధన్"




**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాడు హై స్కూల్‌లో ముందస్తు రాఖీ పండుగ ఘనంగా జరిగింది, ప్రధానోపాధ్యాయులు మధుసూదన్‌రావు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా జరిగే ఏకైక పండుగ రక్షాబంధన్ అన్నారు. జీవితంలో సోదరికి అండగా ఉండే ఏకైక వ్యక్తి సోదరుడు, పురాణకాలం నుండి భారతదేశంలో ఈ ఆచారం ఉంది అన్నారు. ఈ రోజు ఉదయం నుండి విద్యార్థులు కొత్త బట్టలు, స్వీట్స్, రాఖీలతో ఎంతో సందడిగా ఉన్నారు. కార్యక్రమం ప్రారంభమైన వెంటనే ఉత్సాహంగా సోదర సమానులైన విద్యార్థులకు రాఖీలు కట్టించుకుని స్వీట్స్ పెట్టి సోదరుల అశ్వరాదం తీసుకున్నారు. సోదరులు కూడా వారికి తోచిన బహుమతులు ఇచ్చి సంతోషపరిచారు.

ఈ సందర్భంగా శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ విద్యార్థులు మధ్య సోదరభావం ఉంటేనే అవాంఛనీయ సంఘటనలు పాఠశాలలో జరగవు అన్నారు. ఇటువంటి కార్యక్రమలు విద్యాలయంలో జరిపించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.వి.గిరి, శ్యామల కుమారి, వీరవేణి, మేరీ జోన్స్, సత్యవతి, ఆంజనేయులు, వెంకటలక్ష్మి, పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్యామ్‌కు 'చేయూత' అభినందనలు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఇటీవల విడుదలైన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో 75 శాతం పైగా శ్యామ్ ఇన్స్టిట్యూట్ విద్యార్థులు ఉత్తీర్ణులు కావడంతో శ్యామ్ ఇనిస్టిట్యూషన్స్ కొత్త రికార్డ్ సృష్టించిందని చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మొండి రవికుమార్ అన్నారు. బుధవారం ఉదయం శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో అధినేత శ్యామ్‌ను ప్రత్యేకంగా శాలువా కప్పి ప్రశంసించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎన్నో వేల కుటుంబాలకు జీవనోపాధి కల్పించడంలో శ్యామ్ చూపిస్తున్న శ్రద్ధ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో అత్యధికంగా ఉత్తీర్ణత పొందడం తద్వారా కాకినాడ జిల్లాకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని కొనియాడారు.

శ్యామ్ మాట్లాడుతూ సివిల్ విభాగంలో 2590 ఏపీఎస్పీ కానిస్టేబుల్స్ విభాగంలో 2083 మంది శ్యామ్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని అన్నారు. మొత్తం 6014 మంది విద్యార్థులు పరీక్షలలో ఉత్తీర్ణత సాధించారని అందులో 4673 మంది విద్యార్థులు శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కి చెందినవారు కావడం గర్వకారణమని శ్యామ్ అన్నారు. ఉత్తమ విద్యా బోధనను సద్వినియోగం చేసుకుంటూ ఎంతోమంది విద్యార్థులు తమ తమ లక్ష్యాలను చేరుకోవడంలో సఫలీకృతమయ్యారని కొనియాడారు. సబ్ ఇన్‌స్పెక్టర్ మరియు పోలీస్ కానిస్టేబుల్‌లకు చెందిన నూతన బ్యాచులను ఈ నెల 11 నుండి ప్రారంభిస్తున్నట్లు శ్యామ్ ప్రకటించారు. సమాజానికి రక్షణ కల్పించే వ్యక్తుల అభ్యున్నతి కోసం తమ సంస్థ మరిన్ని క్వాలిటీ ఎడ్యుకేషన్‌ను బోధిస్తామని శ్యామ్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో శ్యామ్ విద్యార్థులు ఉన్నత స్థానంలోనూ మరియు మార్గదర్శకులుగా ఉన్నారని వివరిస్తూ శుభాకాంక్షలు తెలిపిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుకున్నారు.

# కదం తొక్కిన చేనేత కార్మికులు

- చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి
- జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొత్తపల్లి మండలంలో భారీ ఎత్తున ర్యాలీ



**యు.కొత్తపల్లి, మేజర్ న్యూస్ :** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా యు.కొత్తపల్లి మండలంలో అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొని ఉప్పాడ వీవర్స్ కాలనీ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు సుమారు 500 మంది చేనేత కార్మికులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో యు.కొత్తపల్లి గ్రామం, వాకతిప్ప గ్రామం, కుతుకుడుమల్లి, ఉప్పాడ, అమీరాబాద్, మూలపేట మొదలగు గ్రామాల నుంచి భారీ సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించి బాణసంచా పేల్చారు. అనంతరం యు.కొత్తపల్లి మండలం తాసిల్దార్ మరియు ఎంపీడీవో కార్యాలయంలకు వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీ దుర్గా చేనేత సొసైటీ వారి ఆధ్వర్యంలో భారీ అన్న సంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు మాట్లాడుతూ ప్రస్తుతం చేనేత పరిశ్రమ చాలా శిథిలవస్థలో ఉందని రాష్ట్ర మరియు కేంద్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టి చేనేత కార్మికులపై పలు సంక్షేమ పథకాలను అమలు చేయాలని వారు కోరారు. గత ప్రభుత్వంలో ప్రతి కార్మికులకు సంవత్సరానికి 24 వేల రూపాయలు అందజేసేదని కానీ నేడు ప్రభుత్వం ఎటువంటి పథకం అమలు లేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా ఆ పథకాన్ని అమలు చేయాలంటూ వాళ్లు కోరారు. అదేవిధంగా జీఎస్టీని కూడా రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి ముడి సరుకులు వచ్చే విధంగా కృషి చేయాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలను మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి మండలం చేనేత కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి క్రీడలలో మెడల్స్ సాధించిన దివ్యాంగులకు మంత్రి సుభాష్ ప్రశంసలు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** జాతీయస్థాయి క్రీడలలో అద్వితీయ ప్రతిభ కనబరిచి మెడల్స్ గెలుచుకున్న ఇద్దరు దివ్యాంగులను రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రశంసించారు. రామచంద్రపురం నియోజవర్గం కాజులూరు మండలం కాజులూరు గ్రామంకు చెందిన కొల్లు సత్యదుర్గా ప్రొలరాజు ప్రత్యేక ఒలింపిక్ జాతీయస్థాయి బోసి గేమ్ లో ద్వితీయ స్థానం, వ్యక్తిగత విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. అలాగే వాలీబాల్ పోటీల్లో పెమ్మనబోయిన జీవన్ కుమార్ తృతీయ స్థానం సాధించి రామచంద్రపురం నియోజవర్గానికి, రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు సాధించారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన భవిత పాఠశాలకు చెందిన ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎం.జయ ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి సుభాష్ ను తాము సాధించిన మెడల్స్‌తో ఆదివారపుపేటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ఇరువురు క్రీడాకారులతో పాటు, వీరికి ప్రత్యేక శిక్షణ ఇచ్చిన కోచ్ ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్, క్రీడాకారులు మంత్రి సుభాష్‌తో మాట్లాడుతూ మీరిచ్చిన ఆర్థిక సహాయం, ప్రోత్సాహంతోనే ప్రత్యేక ఒలంపిక్స్‌లో పతకాలు సాధించామని మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పలువురు కూటమి పార్టీ నాయకులు క్రీడాకారుల ప్రతిభను అభినందించారు.

# పెద్దాపురం పట్టు వస్త్రాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటుతాం

**– జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి**




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టు వస్త్రాల ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటేందుకు కృషి చేయడం జరుగుతుందని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు.

పెద్దాపురం శ్రీ ముప్పన రామారావు చేనేత సహకార సంఘం భవనంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, మున్సిపల్ చైర్మన్ మాజీ రాజా సూరిబాబు రాజులు హాజరయ్యారు. ఈ సందర్భంగా 50 మంది చేనేత కార్మికులకు ముద్ర రుణాలు కింద రూ.ఒక కోటి చెక్కును అందజేశారు. అనంతరం అక్కడ ప్రదర్శించిన చేనేత వస్త్రాల స్టాల్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ చేనేత రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని చేనేత కార్మికులకు విద్యుత్తు రాయితీ కూడా ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. చేనేత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలని సద్వినియం చేసుకోవాలని ఆయన తెలిపారు. పెద్దాపురం చేనేత వస్త్రాలకు, ముఖ్యంగా పట్టు చీరలకు జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకువచ్చేందుకు జిల్లా యంత్రాంగం సంపూర్ణంగా కృషి చేస్తుందన్నారు. ఒక జిల్లా ఒక ప్రోడక్ట్ కింద పెద్దాపురం సిల్క్ చీరకు గుర్తింపు దక్కడంతో గత నెలలో జిల్లా కలెక్టర్ గా జాతీయ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. జాతీయస్థాయిలో అవార్డు గెలుచుకోగల అత్యుత్తమ నాణ్యత కలిగిన చేనేత ఉత్పత్తులు మన జిల్లాలో ఉన్నాయని ఆయన తెలిపారు. మన దగ్గర ఇంత గొప్ప కళ ఉన్నప్పటికీ, దానికి రావలసినంత గుర్తింపు రాలేదనేది స్పష్టమవుతోందని కలెక్టర్ అన్నారు. చేనేత దినోత్సవం సందర్భంగా ఈ అద్భుతమైన కళానైపుణ్యం గురించి బయట ప్రపంచానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. చేనేత వస్త్రాల ప్రోత్సాహానికి జిల్లా యంత్రాంగం ఇప్పటికే శ్రీకారం చుట్టిందని.. ఇటీవల కాకినాడలో ప్రారంభమైన 15వ జాతీయ స్థాయి బాలికల హాకీ టోర్నమెంట్ విజేతలకు పెద్దాపురం పట్టు చీరలను బహుమతిగా అందించాలని నిర్ణయించినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మన ఉత్పత్తులను ఉన్నత వేదికలపై ప్రదర్శించడానికి ఒక చక్కటి అవకాశమని ఆయన తెలిపారు. ఇకపై జిల్లాలో జరిగే ప్రతి ప్రభుత్వ కార్యక్రమంలో, ప్రతి వేదికపైనా పెద్దాపురం చేనేత ఉనికి ఉండేలా చూస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. "ధోవతులు, చీరలు లేదా ఇతర చేనేత ఉత్పత్తుల రూపంలో అయినా సరే, జిల్లా అధికార యంత్రాంగం నుంచి ప్రచారం కల్పించేందుకు అవకాశం ఉన్న ప్రతి చోట పెద్దాపురం బ్రాండ్‌ను నిలబెడతానన్నారు. ఇంతటి గొప్ప కళను కాపాడుతున్న చేనేత కార్మికులను, వారి కుటుంబాలను జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి మాట్లాడుతూ చేనేత రంగానికి గుర్తింపు తెచ్చిన చేనేత కార్మికులందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. గత ప్రభుత్వం హయాంలో చేనేత పరిశ్రమ పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చొరవతో చేనేత పరిశ్రమకు అండగా ఉండి కార్మికుల జీవన ప్రమాణాలు పెంచేలాగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ గా ఉంటూ గుర్తింపు తీసుకువస్తున్నారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా సూరిబాబురాజు మాట్లాడుతూ పెద్దాపురంలో చేనేత పరిశ్రమ గుర్తింపు వచ్చేలాగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని దానిలో భాగంగా మారుతున్న టెక్నాలజీని అనుగుణంగా చేనేతలో నూతన డిజైనర్స్ ప్రవేశ పెట్టడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జౌళి శాఖ ఏడీ పెద్దిరాజు, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ జయశంకర్, ఇతర చేనేత సహకార సంఘాల సభ్యులు, చేనేత కార్మికులు పట్టణ టిడిపి అధ్యక్షులు రంది సత్యనారాయణ, టిడిపి కౌన్సిలర్ యర్రా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నిడదవోలు పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు




**– నిడదవోలు టౌన్ మాస్టర్ ప్లానింగ్, పట్టణ అభివృద్ధి, సుందరీకరణ మౌలిక సదుపాయ కల్పన తదితర అంశాలపై జరిగిన అఖిలపక్ష భేటీలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**
**– మున్సిపాలిటీ కార్యాలయంలో భేటీ అయిన అఖిలపక్ష నాయకులు**
**– పట్టణ అభివృద్ధికి సంబంధించిన ఆలోచనలు, అభిప్రాయాలు వెల్లడి**
**– పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి దుర్గేష్ హామీ**

**నిడదవోలు, మేజర్ న్యూస్ :** ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిడదవోలు పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కలిసి పనిచేద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. గురువారం నిడదవోలు మున్సిపాలిటీ కార్యాలయంలో టౌన్ మాస్టర్ ప్లాన్ పై జరిగిన అఖిలపక్ష భేటీ చర్చలో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిడదవోలు టౌన్ మాస్టర్ ప్లాన్, పట్టణ అభివృద్ధి, సుందరీకరణ, మౌలిక సదుపాయ కల్పన తదితర అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం జరిగిన చర్చలో పలు పార్టీల నాయకులు పట్టణ అభివృద్ధికి సంబంధించిన ఆలోచనలు, అభిప్రాయాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఏ విధమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్న అంశంపై మాస్టర్ ప్లాన్ ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఏ పట్టణానికైనా మాస్టర్ ప్లాన్ అనేది ముఖ్యమైన డాక్యుమెంట్ అని తెలిపారు. స్థానిక ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకొని క్షేత్రస్థాయి నుండి పైస్థాయి వరకు అభిప్రాయాలు, ఆలోచనలు తెలుసుకొని తదనుగుణంగా మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసుకొని అమలు చేయాల్సి ఉంటుందని చెప్పడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047కు 100 ఏళ్లు పూర్తి చేసుకునే సందర్భంగా వికసిత్ భారత్ -2047 ప్రణాళికను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టారని, ఈ సందర్భంగా దేశంలోని అన్ని ప్రాంతాలు, రాష్ట్రాల ప్రజల అభిప్రాయాలు సేకరించి తదనుగుణంగా దేశాభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు మంత్రి దుర్గేష్ ఉదహరించారు. ఈ క్రమంలో స్వర్ణాంధ్ర-2047 ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూపొందించారని తెలిపారు. 2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా తీర్చిదిద్దాలని భావిస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లా, ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం, ప్రతి గ్రామానికి అవసరమైన అభివృద్ధి ప్రణాళికలు రచించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. నిడదవోలు పట్టణం నేలపై పుట్టినవారికి ప్రాంతంపై మమకారం ఉంటుందని, తమ ప్రాంతం వారు ఏ విధంగా ఉండాలో ఊహించుకుంటున్నారో అలాంటి ఆలోచనలు తెలుసుకొని మాస్టర్ ప్లాన్ విజన్ ను రూపొందించామన్నారు. ఈ ప్రణాళిక తయారీలో అస్పష్టమైన విషయాలుంటే తమ దృష్టికి తేవాలని అధికారులు నోటీసుల ద్వారా పబ్లిక్ డొమైన్ లో పెట్టినట్లు మంత్రి తెలిపారు. పట్టణ అభివృద్ధికి సంబంధించి ఇంకా ఏమైనా ఆలోచనలు ఉంటే మున్సిపాలిటీ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా పలువురు నేతలు స్థానికంగా నెలకున్న డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అదే విధంగా నిడదవోలు పురపాలక సంఘం ముఖద్వారం కావాలని మంత్రి దుర్గేష్ దృష్టికి తీసుకువచ్చారు. అందుకు మంత్రి త్వరలోనే సంబంధిత సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిడదవోలు మున్సిపాలిటీ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ ఛైర్మన్ షేక్ నజీరుద్దీన్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

– తహశీల్దార్ వెంకటలక్ష్మీ



**పెద్దాపురంరూరల్,మేజర్‌న్యూస్ :** రీ సర్వేను పక్కాగా ఖచ్చితత్వంతో పారదర్శకంగా నిర్వహించాలని విలేజ్ సర్వేయర్లను తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ ఆదేశించారు. గురువారం పెద్దాపురం తహశీల్దార్ కార్యాలయంలో విలేజ్ సర్వేయర్లతో రీ సర్వే నిర్వహణపై తహశీల్దార్ సమీక్ష సమావేశం నిర్వహించి, మాట్లాడుతూ మండలంలోని ఆనూరు గ్రామంలో రీసర్వే నిర్వహణలో గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు గుర్తింపును త్వరితగతిన చేపట్టాలని, అలాగే ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఈ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలని తహశీల్దార్ సూచించారు. గ్రామంలో సుమారు 4800 ఎకరాలు భూములకు సంబంధించి, రీసర్వే ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. అలాగే జె.తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన రీ సర్వేలో ఆర్వోఆర్, వి.ఎస్. వంటి వాటిపై సమీక్షించారు. ఈ సమావేశంలో రీ సర్వే డిటి, సర్వేయర్ దేముడు, విలేజ్ సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వామిత్ర సర్వే పరిశీలించిన డిఎల్‌పిఓ బాలామణి



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, చంద్రమాంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీసర్వే ప్రాజెక్ట్, మరియు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వామిత్ర (సర్వే ఆఫ్ అబాది అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజి ఇన్ విలేజ్ ఏరియాస్) పథకంలో భాగంగా నిర్వహించిన స్వామిత్ర సర్వేను గురువారం పెద్దాపురం డిఎల్‌పిఓ బాలామణి పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఇళ్ళ సరిహద్దులు గుర్తించి, అర్హత కలిగిన ఇళ్ళ యజమానులకు ఆస్థి యాజమాన్యపు ధృవీకరణ పత్రాలు జారీ చేసే నిమిత్తం ఈ సర్వే నిర్వహించడం జరుగుతుందని డిఎల్‌పిఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు ఎండి.షావలి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కిరణ్, ఉమెన్ ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

**– అతిక్రమించిన పలువురికి జరిమానా**
**– ఎస్సై చిన్నబాబు**



**రాజవొమ్మంగి, మేజర్‌న్యూస్ :** వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పను సరిగా పాటించాలని అతిక్రమించిన వారికి చట్టపంమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జడ్డంగి ఎస్ ఐ చిన్న బాబు హెచ్చరించారు. గురు వారం ఎస్సై చిన్న బాబు అదర్యంలో పోలీసులు జడ్డంగి సెంటర్‌లో వాహన తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తున్న వాహన దారులపై ప్రత్యేక దృష్టి పెట్టి హెల్మెట్ లేకుండా బైక్‌లు నడుపుతున్న వారిపై వాహనపు డాక్యుమెంట్లు లేకుండా ప్రయాణిస్తున్న వారిపైలైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నవారు, మోతాదు మించిన హార్న్‌లు వాడుతున్నవారు తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకుని వారికి ట్రాఫిక్ చలాన్లు విధించడం జరిగిందని ఎస్ఐ చిన్న బాబు తెలిపారు. ఈ తనిఖీల ఉద్దేశ్యం ప్రజల్లో ట్రాఫిక్ నియ మాల పట్ల అవగాహన పెంచడమే కాకుండా, రోడ్డు ప్రమాదాలను తగ్గించడం ప్రజలంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ చిన్న బాబు కోరారు.

# రెండుగా చీలనున్న వై.రామవరం మండలం

– కొత్త మండలం ఏర్పాటుపై ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపిన బిజెపి నాయకులు





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో కొత్త మండలం ఏర్పాటుతో గిరిజన ప్రజల చిరకాల కల నెరవేరిందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అల్లూరి సీతారామరాజు రంపచోడవరం నియోజకవర్గం పరిధిలో వై.రామవరం మండలాన్ని రెండు మండలాలుగా విభజించేందుకు క్యాబినెట్ ఆమోదం తెలపడం చాలా సంతోషంగా ఉందని, ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి అన్నారు. వై.రామవరం చేరుకోవడానికి గిరిజనులు పడుతున్న కష్టాలను దృష్టిలో ఉంచుకుని గతంలో చంద్రబాబును కలిసి భారతీయ జనతా పార్టీ తరఫున వినతి పత్రం ఇవ్వడం జరిగిందని, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీని చంద్రబాబు దృష్టిలో పెట్టడం జరిగిందని, కొత్త మండలం ఏర్పాటు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని బొజ్జి రెడ్డి తెలిపారు. వై రామవరం మండలాన్ని ఎగువ వై.రామవరం, దిగువ రామవరం అనే పేర్లతో రెండు మండలాలుగా విభజించేల త్వరలో ప్రాథమిక నోటిఫికేషన్ జారీకి కేబినెట్ నుంచి అనుమతి వచ్చిందని, వై.రామవరం మండల ప్రజలకు ఇది చిరకాల కోరికని, దీనిని దృష్టిలో ఉంచుకుని కొత్త మండలం ఏర్పాటు చేయాలని ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారన్నారు, 2017లో గతంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఈ హామీ ఇచ్చారని, అప్పుడే ఈ మండలాన్ని విభజించి కొత్తగా మరో మండలం ఏర్పాటు చేస్తామన్నారని అదే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లానని బొజ్జిరెడ్డి తెలిపారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే సిద్ధం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. 2019లో ప్రభుత్వం మారిపోవడంతో ఈ ప్రక్రియ జరగలేదని, చంద్రబాబు వెంటనే స్పందించి సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ను ఆదేశించడంతో కలెక్టర్ నివేదికను పరిశీలించి క్యాబినెట్ ఆమోదం తెలపడం జరిగిందని, చాలా సంతోషంగా ఉందని చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ ట్రైబ్స్ కమిషన్ చైర్మన్ సోళ్ల బుజ్జి రెడ్డి తెలిపారు. ఆయనతోపాటు భారతీయ జనతా పార్టీ నాయకులు కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు), మాజీ అసెంబ్లీ కన్వీనర్ ఈక బుల్లికొండల దొర ఒక ప్రకటనలో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో ఆదిత్య విశ్వవిద్యాలయం 3వ స్థానం

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ప్రతిష్టాకరమైన కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో ఆదిత్య విశ్వవిద్యాలయం 3వ స్థానాన్ని సంపాదించింది అని ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ఈ ఆనందకర విషయాన్ని పంచుకోవడం సంతోషంగా ఉంది అని డా. ఎన్. సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ బంజారా హిల్స్ రాడిసన్లో జరిగిన కేంబ్రిడ్జ్ సమన్వయకర్తల వార్షిక సమావేశంలో ఈ అవార్డు స్వీకరించిన ఆదిత్య యూనివర్సిటీ ప్రతినిధి డా. తెలుగు నీలిమ మాట్లాడుతూ తమ ఆదిత్య విశ్వవిద్యాలయంలో అభ్యాసకుల అవసరాల కు అనుగుణంగా మాడ్యూల్ యొక్క విజయవంతమైన మరియు అనుకూలీకరించిన అమలుకు ఈ గుర్తింపు లభించినట్లు ఆమె తెలిపారు. సమావేశంలో డాటి నీలిమ ఇచ్చిన ప్రజెంటేషన్ను నిర్వాహకులు అభినందించారు. ఈ గౌరవాన్ని అందుకున్నందుకు గర్వంగా ఉంది అని ఇది నిజంగా గొప్ప క్షణం అని నీలిమ ఆనందం వ్యక్తం చేశారు. ఆదిత్యకు ఎక్సలెన్స్ అవార్డు విభాగంలో 3వ స్థానాన్ని పొందడం పట్ల ఛాన్సలర్. డా. ఎన్.శేషారెడ్డి, ప్రో.ఛాన్సలర్ డా.ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎం.శ్రీనివాస రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి.శ్రీనివాస్,ప్రో. వైస్ ఛాన్సలర్స్, రిజిస్ట్రార్, వివిధ విభాగాల డీన్లు ఆనందం వ్యక్తం చేశారు.




# భారతీయ చేనేత ప్రపంచానికే వస్త్రాలను అందించింది

**ఏలేశ్వరం,మేజర్న్యూస్ :** భారతీయ చేనేత యావత్ ప్రపంచానికి వస్త్రాలను అందించిందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సునీత అన్నారు.గురువారం జాతీయచేనేతదినోత్సవంను పురస్కరించు కుని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోసాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా.డి.సునీత,ప్రిన్సిపల్ అధ్యక్షత వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం యొక్క ప్రాధాన్యతను వివరించారు. భారత స్వాతంత్ర్యోద్యమములో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది చేనేత అని, చేనేత రంగం ప్రాచీన వారసత్వంగా మనకు వస్తుందని, పోచంపల్లి, బనారసి, వెంకటగిరి, గద్వాలు,జందాని, కాంచీపురం, ధర్మావరం, ఉప్పాడ వంటి ప్రాంతాలు చేనేత వస్త్రాలకు పేరుగాంచిన ప్రాంతాలని, మన దేశంలోని గ్రామీణ ప్రాంతాలలో జీవనోపాధికి ముఖ్యమైన వనరుగా నిలిచింద న్నారు.అత్యధిక మహిళా జనాభా ఈ రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఇది మహిళా సాధికారతను నేరుగా ప్రస్తావించే రంగం, మొత్తం నేత కార్మికులు మరియు అనుబంధ కార్మికులలో 70% కంటే ఎక్కువ మంది మహిళలున్నారు. మన చేనేత కార్మికులు నేసే వస్త్రాలు ఖండాంతర ఖ్యాతిని సంపాదించాయని. 2018 సంవత్సరంలో తెలంగాణలో తయారు చేసిన జాతీయ జెండాను ఒక్క కుట్టుకూడా లేకుండా అశోక స్తంభం లో ఉండే 24 పోచాలు కూడా కుట్టులేకుండా మగ్గం తోను అదే విదంగా అగ్గిపెట్టెలో ఇమిడిపోయే చీరను తయారు చేసే సామర్థ్యం ఉండే



కళాకారులు చేనేత కార్మికులన్నారు. నేడు వారు అంతా సంతోషంగా జీవితాలు గడపడం లేదని దీనికి కారణం పవర్ లూమ్ ఉంటే అత్యాధునిక యంత్రాలు రంగ ప్రవేశం చేయడంతో వారికి ఉపాధి సమీలిందన్నారు. చేనేత కార్మికుల నైపుణ్యాన్నిగౌరవించి వారికి ఛేదోడు గా ఉండాలని విద్యార్థులకు తెలియ పరిచారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ప్రయాగ మూర్తి ప్రగడ మాట్లాడుతూ చేనేత కూటుంబాలకు సరైనా ఆదరణ లేక గ్రామీణ ప్రాంతాల నుండి వలస పోయి బ్రతుకు తున్నారని మనవంతుగా చేనేత వస్త్రాలు దరించి కొంత ఆసరాగా నిలుద్దామని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక విభాగం కన్వీనర్ వీరభద్ర రావు, సభ్యులు, డా. శివ ప్రసాద్, లక్ష్మి కుమారి మేరీ రోజలీనా, పుష్పా అధ్యాపకులు కె సురేష్, డా. మదీనా, డా. బంగార్రాజు, సతీశ్, రాజేశ్ అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు



**ఆత్రేయపురం,మేజర్న్యూస్:** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి అన్నదాన భవన నిర్మాణానికి గురువారం కాకినాడకు చెందిన వేల్పూరు మురళి సురేష్, భువనేశ్వరి దంపతులు రూ. 1,50 ,116లు; రావులపాలెంకు చెందిన మల్లిడి నాగ వెంకట ఫణి కుమార్ రెడ్డి, శ్రీలక్ష్మి దంపతులు రూ.27 వేలు విరాళంగా అందిం చారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగ తం పలి కి స్వామి చరిత్ర గురించి వివరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్యచక్రధర్రావు శ్రీవారి చిత్రపటం అందించారు.

## జగన్మోహిని కేశవస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ర్యాలీ జగన్మోహిని కేశవస్వామి ఆలయ అభివృద్ధికి గురువారం విశాఖపట్నంకు చెందిన బి.విజయ సిద్ధార్థ రూ.10,116లు విరాళంగా అందించారు. దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. దాతలకు ఆలయ ఈవో భాగవతుల వెంకట రమణమూర్తి స్వామివారి చిత్రపటం అందించారు.

## సౌమ్య అపహరణ దర్యాప్తు కొనసాగుతుంది

– అల్లూరి జిల్లా ఎస్పి






**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దేవీపట్నం మండలం శరభవరం గ్రామ సచివాలయం సంక్షేమ సహాయకురాలు సోయం శ్రీ సౌమ్య అపహరణపై పోలీసు దర్యాప్తు కొనసాగుతుందని అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్ట్ 7వ తేదీన జరిగిన అపహరణ సంఘటనకు సంబంధించి ఫిర్యాదు నమోదు అయ్యింది అని, ఈ సంఘటనలో నర్సాపురం గ్రామానికి చెందిన, ప్రస్తుతం శరభవరంలో వెల్ఫేర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న మల్లుదొర కుమార్తె, 26 సంవత్సరాల సోయం శ్రీ సౌమ్య అపహరణకు గురయ్యారని వచ్చిన ఫిర్యాదు ప్రకారం, ఆగస్ట్ 7న ఉదయం 10:30 గంటల సమయంలో, వేటుకూరు గ్రామానికి చెందిన కె.అనిల్ కుమార్ మరికొందరు సహాయంతో బూడిద రంగు ఇన్నోవా క్రిస్టా (ఏపీ31 టజీ 1462) వాహనంలో ఆమెను అపహరించారని తెలుస్తోంద న్నారు.గతంలో కూడా ఈ వీరు 21–10–2024న ఇలాంటి సంఘ టనలో భాగంగా ఉన్నారు. ఆ సందర్భంలో దేవీపట్నం పోలీసు స్టేషన్లో మహిళా కనుమరుగు కేసు (జతీ. చీశీ. 70/2024) నమో దు చేయబడింది. ఆ కేసు విచారణలో కుటుంబాల వ్యతిరేకత కార ణంగా ఇద్దరూ స్వేచ్ఛగా తప్పించుకున్నారని, చిత్రకొండ (ఒడిశా)లో వారిని గుర్తించారు. పోలీసులు అప్రమత్తమై వెంటనే క్రింది చర్యలు తీసుకున్నారు. శరభవరం, మారేడుమిల్లి మరియు ప్రయాణ మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజ్ స్క్రూటినీ చేసారు. సబ్-డివిజన్ సరిహద్దు ప్రాంతాల్లోని చెక్-పోస్టులకు సంబంధిత వాహనం పట్ల హెచ్చరిక చేసారు. బాధిత ఆరోపితుడి స్వగ్రామాల్లో శోధనా కార్యక లాపాలు చేపట్టారు. ఆరోపితుడి మునుపటి ప్రాంతాలు, తెలిసిన సహచరుల పరిశీలిస్తున్నారు. సంబంధిత వాహనం మరియు ఆరోపి తుని వివరాలు అన్ని సమీప పోలీసు స్టేషన్లతో పంచుకోబడ్డాయి. ఈ కేసు గతంలో జరిగినట్లుగా అపహరణ లేక స్వచ్ఛందంగా తప్పించు కున్న సంఘటనా అని విచారణ ద్వారా నిర్ణయించబడుతుంది. ప్రజ లు సహకరించాలని విజ్ఞప్తి చేసారు. సంబంధిత సమాచారం ఉన్నవారు దయచేసి క్రింది నంబర్లకు కాల్ చేయండి: 944090 0761, 9440796517. మీడియా సభ్యులు సహకరించాలని అభ్యర్థిస్తూ..విచారణలో మరిన్ని విషయాలు తెలియపరుస్తామని చెప్పారు.

# నూతన సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు

**– ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** జెడ్ రాగం పేటలో జగ్గంపేట సామాజిక ఆరోగ్య కేంద్రం నూతనంగా నిర్మాణం చేసి ప్రారంభించుకోవడం జరిగింది. గురువారం ఈ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముందుగా ఆస్పత్రికి చేరుకున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎమ్మెల్యేకు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాండ్రంగి రాంబాబు, బొడ్డేటి సుమన్, నకిరేడ్డి సూర్యవతి టిడిపి నాయకులకు ఆరోగ్య కేంద్రం సూపర్డెంట్ డాక్టర్ ప్రణీత్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆన్ లైన్ ఓపి తీసుకుని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆసుపత్రిలోని వైద్యులు, నర్సులు సిబ్బందితో సమావేశం నిర్వహించి ఆసుపత్రికి ఏమైనా సమస్యలు ఉంటే తెలుసుకుని ఇంకా ఎక్కడైనా ఇబ్బంది ఉంటే వాటిపైన దృష్టి పెట్టి  వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో వైద్యశాల అందించాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ నూతన సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఈరోజు నుండి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని అన్నారు. అన్ని రకాల ఆధునిక పరికరాలతో ఇక్కడ వైద్యం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. జగ్గంపేటకు దూరంగా హాస్పటల్ ఉంది అని ఒక విలేఖరి ప్రశ్నించగా హాస్పటల్ ఇటువంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంటే రోగులు తొందరగా కోలుకుంటారని అన్నారు. జగ్గంపేట నుండి తొందర్లోనే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పాండ్రంగి రాంబాబు వాహనాన్ని ఏర్పాటు చేసి ఉచితంగా ఆసుపత్రికి రోగులను తీసుకొచ్చేందుకు ఏర్పాటు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఆటోలను కూడా తక్కువ చార్జీతో రోగులను ఇక్కడకు చేర్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, గండేపల్లి, జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, కందుల చిట్టిబాబు, కందుల కొండయ్య చౌదరి (బాబ్జి), అడబాల వెంకటేశ్వరరావు, దేవరపల్లి మూర్తి, అనుకుల శ్రీకాంత్ పాలచర్ల నాగేంద్ర చౌదరి, వేములకొండ జోగారావు, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# 11వ జాతీయ చేనేత,7వ అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మురమండలో ఘనంగా కార్యక్రమం

**– చేనేత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
**– ఐదుగురు చేనేత కార్మికులకు సన్మానం**



**కడియం, మేజర్న్యూస్ :** గురువారం 11వ జాతీయ చేనేత దినోత్సవం మరియు 7వ అంతర్జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం మురమండ గ్రామంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో సేవలు అందిస్తున్న ఐదుగురు ప్రముఖ చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా హ్యాండ్లూమ్ అభివృద్ధి అధికారి సిహెచ్. రవికుమార్ మాట్లాడుతూ  మురమండ, పులుగుర్త, వడిశలేరు గ్రామాలలో చేనేత క్లస్టర్ పథకం అమలుతో సుమారు 850 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్లు థ్రిఫ్ట్ ఫండ్‌గా విడుదల చేయడం, 50 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.4000 వృద్ధాప్య పెన్షన్ అమలవుతున్నదని తెలిపారు. అదేవిధంగా ప్రతి చేనేత కుటుంబానికి నెలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ఈ రోజు నుండే అమలులోకి వచ్చిందని తెలిపారు. జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ పథకం అమలుతో ఉత్పత్తుల ధరలు తగ్గి అమ్మకాలు పెరగడంతో కార్మికులకు ప్రత్యక్షంగా లబ్ధి కలుగుతుందని వివరించారు.

చేనేత సేవకేంద్రం నిర్వాహకులు జి.వి. నాగేశ్వరరావు మాట్లాడుతూ – మురమండ గ్రామానికి జియోగ్రాఫికల్ ఇండికేషన్  గుర్తింపు రావడం గర్వకారణమని, దీనివల్ల స్థానిక చేనేత ఉత్పత్తులకు ప్రాధాన్యత పెరుగుతుందని పేర్కొన్నారు.డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ శ్రీమతి టీ. లక్ష్మి తులసి మాట్లాడుతూ – స్వయం సహాయక సంఘాల ద్వారా బ్యాంకులు ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, థ్రిఫ్ట్ ఫండ్‌ను ఉపాధి అవకాశాలుగా మలచుకోవాలని సూచించారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ దేవళ్ళ రామ్ మోహన్ రావు మాట్లాడుతూ  చేనేత ఉత్పత్తులకు మార్కెట్ యార్డులో ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేయడం ద్వారా అమ్మకాల వృద్ధికి తోడ్పడుతున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ అయినవిల్లి రుక్మిణి మాట్లాడుతూ – మురమండ కు జి ఐ గుర్తింపు రావడం గ్రామ అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని, ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చేనేత ఉత్పత్తుల ప్రదర్శనలు, చేనేత కళలపై అవగాహన వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయి. కార్యక్రమ ముగింపు సందర్భంగా అధికారులు, సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు చేనేత పరిశ్రమ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో దశాబ్దాలుగా సేవలు అందిస్తున్న ఐదుగురు చేనేత కార్మికులు –కొమ్మన పాపాయమ్మ, జట్లా నాగ సత్యవతి, పిచ్చిక సుబ్బారావు, దైవపు బూరయ్య, దొంతంశెట్టి మల్లేశ్వరరావు, అభినందనలకు పాత్రులయ్యారు. వారిని ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి పి. రామారావు చౌదరి, వట్టికూటి జానకిరామయ్య, యర్రం సత్యనారాయణ, కర్రి వీరభద్రరావు, బత్తుల చినగణేష్, పొంతం పెట్టి వెంకటేశ్వరరావు, గన్ని బాజి తదితర స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పలువురు చేనేత కార్మికుల కుటుంబ సభ్యులు హాజరయ్యారు.

# "గ్రీన్ పెరవలి- క్లీన్ పెరవలి" కార్యక్రమానికి సహకరించండి

**– మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతిలకు**
**పెరవలి ఆర్యవైశ్య సంఘం సభ్యుల విజ్ఞప్తి**



**పెరవలి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో పెరవలి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమంలో భాగంగా క్లీన్ పెరవలి గ్రీన్ పెరవలి కార్యక్రమం చేపట్టామని ఆ కార్యక్రమంలో భాగంగా పెరవలి గ్రామంలోని ప్రజలందరికీ ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల స్థానంలో జ్యూట్ బ్యాగులు ప్రత్యేకంగా తయారు చేయించి ఇస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ శాఖ మంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆంధ్రప్రదేశ్ టూరిజం సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి నిడదవోలు నియోజకవర్గ ఎమ్మెల్యే కందుల దుర్గేష్ గార్ల ఫోటోలతో జ్యూట్ బ్యాగులు తయారు చేయించి గ్రామ ప్రజలందరికీ ఉచితంగా ఇస్తున్నామని పెరవలి మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ చెక్ పోస్ట్ లో డిజిటల్ పేమెంట్ ల ప్రారంభానికి విచ్చేసిన మంత్రి దుర్గేష్ తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి లకు పెరవలి ఆర్యవైశ్య సంఘ సభ్యులు వివరించారు. ఈ సందర్భంగా వారు చేయించిన జ్యూట్ బ్యాగులను కలెక్టర్ ప్రశాంతికి మంత్రి దుర్గేష్ కు ఆ కార్యక్రమానికి విచ్చేసిన అందరికీ పంపిణీ చేశారు. అధికారులు కూడా తమకు సహకరిస్తే తాము ఈ కార్యక్రమాన్ని మరిన్ని గ్రామాలలో నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని తమ పెరవలి గ్రామానికి డంపింగ్ యార్డ్ స్థలం మంజూరు చేయాలని డంపింగ్ వ్యర్థాలు తరలించడానికి ట్రాక్టర్ ను మంజూరు చేయాలని ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ ప్రశాంతిని కోరారు. ఈ కార్యక్రమంలో పెరవలి గ్రామ సర్పంచ్ గంగోలు సీతమ్మ జోసెఫ్, కార్యదర్శి అడపా లక్ష్మీనారాయణ, పెరవలి ఆర్యవైశ్య సేవా సంఘం కార్యదర్శి గుడివాడ బాలకృష్ణ, సభ్యులు వెంకటేశ్వరరావు, గుడివాడ వెంకయ్య, గుడివాడ చిన్న శ్రీనివాస్, గుడివాడ శ్రీహరి, సత్య రాంప్రసాద్, పాల్గొన్నారు.

# గర్భిణి మృతిపై విచారణ

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీ మృతిపై పూర్తి స్థాయి విచారణ చేయించడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు.  గురువారం స్థానిక ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వారి క్యాంపు కార్యాలయంలో రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ దేవీపట్నం మండలం దామనపల్లి గ్రామానికి చెందిన పండా సింధు 29 సంవత్సరాలు భర్త చంద్రశేఖర్ గర్భిణీ స్త్రీ అయినటువంటి పండా సింధు గత కొద్ది రోజుల క్రితం గర్భిణీతో డెలివరీ కోసం రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో జాయిన్ అవ్వడం జరిగిందని అదేవిధంగా ఆవిడ పరిస్థితి సీరియస్ కండిషన్ ఉండటం వలన డెలివరీ కోసం రాజమండ్రి ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయడం జరిగిందని అదేవిధంగా  ఈనెల ఆరో తారీఖున రాత్రి గర్భిణీ స్త్రీ అయినటువంటి సింధు మృతి చెందడం జరిగిందని వైద్యాధికారులు తెలియజేసిన వెంటనే స్పందించి ఈఘటనపై అల్లూరి సీతారామరాజు జిల్లా డిసిహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి, ఈస్ట్ గోదావరి జిల్లా రాజమండ్రి  డిసిహెచ్ఎస్ డాక్టర్ పద్మావతి ఇరువురు దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ సంఘటనలో ఏమైనా తప్పులు ఉన్నయెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు.

## ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ బూరుగుపూడి సచివాలయాన్ని సందర్శన

**– వాట్సప్ గవర్నెన్స్‌పై విస్తృత ప్రచారం కల్పించాలి**




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రాజమహేంద్రవరం రెవిన్యూ డివిజన్ అధికారి ఆర్. కృష్ణ నాయక్ కోరుకొండ మండలం బూరుగుపూడి సచివాలయాన్ని గురువారం ఆకస్మికంగా సందర్శించి, కార్యాలయ పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మనమిత్ర ఔష్ఘ్రాజూజూ సేవలు (95523 00009) అమలుపై సిబ్బందిని ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అన్నదాత సుఖీభవ, జ=జజ కార్డులు, వాటర్ ట్యాక్స్ వంటి సేవలను వేగవంతంగా పూర్తి చేయాలని ఎ=ాలపై ఆదేశాలు జారీచేశారు.ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు మరియు సంక్షేమ పథకాల అమలులో సచివాలయ సిబ్బంది బాధ్యతను అత్యంత కీలకంగా పేర్కొన్నారు.తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలపై లబ్ధిదారులకు తగిన సూచనలు అందించాలని, అర్హులైన వారు తప్పకుండా పథకాల లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. వాట్సాప్ గవర్నెన్స్ పై విస్తృత ప్రచారం చేపట్టాలని, ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరు, సేవల పర్యవేక్షణ, ప్రజలతో అనుసంధానం తదితర అంశాలపై పలు సూచనలు చేశారు.

## కౌశికలో చెత్తను తొలగించాలి

**– షాప్ యజమానులను ఆదేశించిన ఆర్డీవో శ్రీకర్**



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** కౌశిక పూడిక వ్యర్థాలను త్వరగతిన తొలగించి, పారిశుద్ధ్య నిర్వహణ చేయాలని డ్రైన్స్,పంచాయతీ అధికారులను కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ ఆదేశించారు. గురువారం ఉదయం పలివేల వంతెన నుండి బ్యాంక్ కాలనీ వరకు కౌశికను ఆయన పరిశీలించారు.చెత్త,చెదారాలను కౌశికలో వేయకుండా, ఉన్న వాటిని ఎవరికివారే స్వచ్ఛంధంగా తొలగించాలని సంబంధించిన షాప్ యజమానులను సూచించారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైన ఆక్రమించి నిర్మాణాలు చేపడితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో తహశీల్దార్ డి.రాంబాబు, ఎంపిడివో నరేష్ కుమార్,డ్రైన్స్ ఏ.ఈ ఆనంద్,పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ వర్గానికి కొండంత అండ బ్రాహ్మణ సొసైటీ

– లాభాల బాటలో సొసైటీ నిర్వహణ
– 18 ఏళ్లు దాటిన బ్రాహ్మణులు సభ్యత్వం తీసుకోవాలి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కేవలం బ్రాహ్మణ సామాజికవర్గానికి మాత్రమే ఒక సొసైటీ ఏర్పాటు చేసిన ఘనత 2014-19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కిందని బ్రాహ్మణ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కాకినాడ మేనేజర్ పుల్లకవి శ్రీకాంత్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17 బ్రాంచ్‌లతో ఈ సొసైటీ లాభాల బాటలో నడుస్తోంది అన్నారు. నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన అనంతరం అనుబంధంగా సొసైటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఇప్పుడు అది బ్రాహ్మణ బ్యాంకుగా దేశంలోనే గుర్తింపు పొందిందని వెల్లడించారు. గురువారం కాకినాడ సొసైటీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటివరకు కాకినాడ బ్రాంచ్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 20 కోట్ల రూపాయలను వివిధ పథకాల కింద రుణాలుగా ఇవ్వడం జరిగింది అన్నారు. డ్వాక్రా సంఘాలలో మహిళలకు మాత్రమే రుణాలు ఇస్తారని కానీ ఈ సొసైటీలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది పురుషులు ఓ గ్రూపుగా ఏర్పడితే వారికి వశిష్ట పేరిట రుణాలు ఇస్తాము అన్నారు. అలాగే చాలామంది బ్రాహ్మణ మహిళలు డ్వాక్రా సంఘాలలో ఉండరని, వారిని దృష్టిలో పెట్టుకుని ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది మహిళలు గ్రూపుగా ఏర్పడితే అరుంధతి పేరున రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పాత్రికేయులు, ఉపాధ్యాయులు, లాయర్లు, పాత్రికేయులు, ప్రైవేటు టీచర్లు, పురోహితులకు ఇలా వివిధ వృత్తుల్లో ఉన్నవారికి సమాచార మిత్ర, ఆచార్యమిత్ర, న్యాయ మిత్ర, పురోహిత మిత్ర పేరిట రుణాలు ఇస్తున్నామన్నారు. అదేవిధంగా అన్నవరం దేవస్థానంలోని వ్రత పురోహితులకు అత్యధికంగా ఆరు కోట్ల రూపాయలు రుణం ఇవ్వడం జరిగింది అన్నారు. అలాగే మార్ట్‌గేజ్ రుణాలు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. ఇక ఇప్పటివరకు ఈ బ్యాంకు 4 కోట్ల రూపాయల వరకు డిపాజిట్లు సేకరించింది అన్నారు. 18 సంవత్సరాలు దాటిన, 60 ఏళ్ల లోపు బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందినవారు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా రూ.600 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలని, ఆ సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరికి ఈ పథకాలు వర్తింపచేస్తామని వెల్లడించారు. గ్రూపు రుణాలు తీసుకున్నవారిలో దురదృష్టవసాత్తు ఎవరైనా చనిపోతే వారికి 50 వేల రూపాయల ఇన్సూరెన్స్ సౌకర్యంతోపాటు వారు తీసుకున్న రుణం మాఫీ అవుతుంది అన్నారు. గ్రూపులో చనిపోయినవారి రుణం మాత్రమే మాఫీ అవుతుందని స్పష్టం చేశారు. బ్రాహ్మణ సామాజికవర్గానికి ఈ సొసైటీ అండ దండగా నిలుస్తుందని, 17 బ్రాంచ్‌లతో ఎక్కడా ఎలాంటి లోపాలు లేకుండా సీఈఓ నాగసాయి ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్వహణలో ఈ బ్యాంకు ఉంది అన్నారు. బ్యాంకులో డిపాజిట్ చేసినవారికి ప్రభుత్వమే గ్యారెంటీ అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా బ్రాహ్మణ సామాజికవర్గానికి రాష్ట్రంలో ఒక దిక్సూచి ఏర్పడి తద్వారా సొసైటీ ఏర్పడినట్లు శ్రీకాంత్ వెల్లడించారు. ఎవరికి ఎలాంటి రుణాలు కావాలన్నా బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందినవారు కాకినాడలోని బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్ నెంబర్ 0884 2306644 నెంబర్‌లో సంప్రదించి సమాచారం తీసుకోవచ్చు అన్నారు. బ్యాంకు లాభాల బాటలో ఉందని అలాగే రుణాల రికవరీ 95% పైగా ఉందని వెల్లడించారు. పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన బ్రాహ్మణులు సొసైటీ సేవలు వినియోగించుకోవాలని కోరారు. అదే విధంగా ఆర్థిక స్థితిలో ఉన్న బ్రాహ్మణులు, రిటైర్ అయినవారు ఈ బ్యాంకులో డిపాజిట్లు చేయవచ్చని, డిపాజిట్లకు 100% గ్యారెంటీ ఉందని మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు.

# కనిపించకుండా పోయిన అవివాహిత మహిళను పట్టుకున్న పోలీసులు




**గండేపల్లి, మేజర్ న్యూస్ :** తాళ్లూరి గ్రామం నకు చెందిన ఒక అవివాహిత ఆగస్టు ఫస్ట్ న మిస్ అవ్వడం జరిగింది. దానిపై గండేపల్లి పోలీస్ స్టేషన్ లో 249/2025 విమెన్ మిస్సింగ్‌గా కేసు నమోదు చేయడం జరిగింది. జగ్గంపేట సిఐ వై ఆర్ కె శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం,గండేపల్లి ఎస్సై శివ నాగబాబు మరియు సిబ్బంది అనేక రకాలుగా ప్రయత్నించి చివరకు ఆమెను హైదరాబాద్‌లోని బోయెనుపల్లి పోలీస్ స్టేషన్ ఏరియాలో ఆమెను ట్రేస్ చేయడం తెలిపారు. ఆమెను గండేపల్లికి తీసుకొని వచ్చి బంధువులకు అప్పగించనున్నట్లు సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు.

# చింతూరు సిహెచ్‌సిలో ప్రపంచ తల్లిపాలు వారోత్సవాలు

**చింతూరు, మేజర్ న్యూస్ :** ప్రపంచ తల్లిపాలు వారోత్సవాన్ని పురస్కరించుకుని సిహెచ్‌సి చింతూరులో ఆగస్టు 1 తేది నుండి 7వ తేది వరకూ కార్యక్రమాన్ని చింతూరు మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది, తల్లులు, ఆశా, ఎఎన్‌ఎంలు మరియు సిబ్బందితో తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన పెంచడంపై దృష్టి సారించింది. ఈ కార్యక్రమం డా. ఎం.వి.కోటిరెడ్డి సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో, డా పుల్లయ్య డిప్యూటి డిఎంఎచ్‌ఓ ముఖ్య అతిథిగా విచ్చేశారు, ఈ కార్యక్రమంలో పిల్లల వైద్యుడు డాక్టర్ బి.మహేష్ ఎస్ఎన్‌సియూ మెడికల్ ఆఫీసర్, తల్లిపాలు ఇవ్వడం యొక్క ప్రాముఖ్యతను మరియు సరైన పోషణ పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగింది. తల్లి మరియు బిడ్డ ఇద్దరికీ తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి తల్లులకు అవగాహన సరైన తల్లిపాలు ఇచ్చే పద్ధతులను ప్రోత్సహించడం మరియు తల్లిపాలు ఇచ్చే తల్లులకు సలహా ఇవ్వడంలో ఆశా, ఎఎన్‌ఎంలు మరియు సిబ్బంది ఉండాలని చెప్పటం జరిగింది. తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలు మరియు పద్ధతులపై స్పష్టత మరియు ప్రశ్నోత్తరాల సెషన్ నిర్వహణ , తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి, సరైన తల్లిపాలు ఇవ్వడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మెరుగైన పద్ధతులు పాటించడం మరియు పోషకాహార ప్రయోజనాల వల్ల తల్లిపాలు ఆరోగ్యకరమైన పెరుగుదల మరియు అభివృద్ధికి అవసరమైన పోషకాలను అందిస్తాయి అని అలగే తల్లిపాలు ఇవ్వడం తల్లి మరియు బిడ్డ మధ్య భావోద్వేగ బంధాన్ని ప్రోత్సహిస్తుందని మరియు ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయి




అని అవి తల్లిపాలు ఇవ్వడం ప్రసవానంతర నిరాశ, కొన్ని క్యాన్సర్లు మరియు తల్లులలో ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుందని మరియు శిశువులలో ఎస్ఐడిఎస్ మరియు సాధారణ బాల్య అనారోగ్యాల ప్రమాదాన్ని తగ్గిస్తుందని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏం.వి.కోటిరెడ్డి సూపరింటెండెంట్, డా. పుల్లయ్య డిప్యూటి డిఎంఎచ్‌ఓ, డా. బి.మహేశ్ ఎస్ఎన్‌సియూ మెడికల్ ఆఫీసర్, డా. రమణరావు గైనిక్, డా.భరద్వాజ్, డా. శశికళ గైనిక్, డా. స్పందన, పోస్ట్ నాటల్ విమెన్స్,ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి లు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ రేషన్‌బియ్యం తరలింపుపై మెరుపు దాడులు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేటలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు గురువారం తెల్లవారుజామున మెరుపు దాడులు నిర్వహించారు. వారికున్న పక్కా సమాచారం మేరకు ఈ దాడుల్లో భారీ స్థాయిలో రేషన్ బియ్యం పట్టుబడింది. మూడు వెహికల్స్‌లో తరలిస్తున్న సుమారు 30 టన్నుల రేషన్ బియ్యం సీజ్ చేసినట్లు డీఎస్ఓ సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్ఓ సత్యనారాయణ రాజు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు జిల్లాలో పిడిఎస్ రైస్ అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ఈరోజు తెల్లవారుజాము నుంచి పిడిఎస్ బియ్యం అక్రమ రవాణాపై నిఘా ఉంచడం జరిగిందన్నారు. జగ్గంపేట జేవియర్ జంక్షన్ వద్ద అనుమానా దస్పదంగా తిరుగుతున్న ఒక వాహనాన్ని అదుపులోకి తీసుకోక దానిలో పిడిఎస్ రైస్ ను గుర్తించి స్టేషన్ కు తరలించడం జరిగిందన్నారు. అదేవిధంగా జగ్గంపేటలోని ఒక రైస్ మిల్లు వెనుక భాగంలో పిడిఎస్ రైస్ వాహనాలు దాచినట్లు గుర్తించి వాటిని తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ యొక్క తనిఖీలలో రెండు వాహనాలను అదుపులోకి తీసుకోక 20 టన్నుల రైస్ ఒక వాహనంలో, ఐదు టన్నుల రైస్ ఒక వాహనంలో ఇలా మొత్తం సుమారు 30 టన్నుల వరకు రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. దీంతో ఆ యొక్క మూడు వాహనాలను అదుపులోకి తీసుకోవడం జరిగిందని,డ్రైవర్లు పరార్ అయినట్లు తెలిపారు.ఆ యొక్క వాహనాలను దగ్గరలోని గొడవనుకు తరలించి, రేషన్ బియ్యాన్ని భద్రపరచడం జరుగుతుందన్నారు. వాహనాలను పోలీస్ స్టేషన్ తరలించి ఈ అక్రమ రైస్ వ్యవహారంలో పట్టుబడిన వారిపై క్రిమినల్ కేసులతో పాటు, సిక్స్ ఏ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

# ఆదిత్య అగ్రికల్చర్ ఇంజనీరింగ్ విభాగంలో వర్క్ షాప్



**గండేపల్లి,మేజర్‌న్యూస్ :** ఆదిత్య విశ్వవిద్యాలయంలోని ఎంట్రప్రెన్యూర్షిప్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో వ్యవసాయ ఇంజనీరింగ్ విభాగం, 2025 ఆగస్టు 7వ తేదీన ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 4:00 గంటల వరకు, న్యూటన్ భవన్ లో "స్టార్టప్‌లకు ఐడియా మరియు ఇన్నోవేషన్" అనే అంశంపై ఒక రోజు వర్క్‌షాప్ను ద్వితీయ మరియు తృతీయ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించినట్లు డిప్యూటీ ప్రో. ఛాన్సలర్. డా. మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ఈవర్క్‌షాప్ ద్వారా యువ మేధస్సుల్లో వ్యాపార చింతనను ప్రేరేపించడం మరియు స్టార్టప్ అభివృద్ధికి అవసరమైన ప్రాథమిక పాఠాలు అందించడం లక్ష్యంగా నిర్వహించబడిందని వివరించారు. ఇ డి సి కో. ఆర్డినేటర్ టి. చరణ్ సంజీవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రభావవంతమైన నెట్‌వర్కింగ్ వ్యూహాలు తెలిపిన తర్వాత, వారు తమ ఆలోచన లపై ఎస్ డబ్ల్యూ ఓటి విశ్లేషణ చేసి, ఆ ఆలోచనల ప్రాయోగికతను అంచనా వేయడానికి మార్గనిర్దేశం చేసారు. అదనంగా, ఇంటరాక్టివ్ బ్రెయిన్‌స్టార్మింగ్ సెషన్లు మరియు గ్రూప్ ప్రెజెంటేషన్లు విద్యార్థుల మధ్య పరస్పర ఆలోచనల పంపిణీ వంటి కృత్యాలతో విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను అమలులో పెట్టదగిన వ్యాపార యోజనలుగా రూపుదిద్దుకునే అద్భుత వేదికగా నిలిచింది.కార్యక్రమం అధ్యంతం విజ్ఞానదాయకంగా జరిగింది.

# చేనేత రంగానికి పూర్వ వైభవం తెస్తాం

- ఆదివారపుపేట, అద్దంపల్లి గ్రామాల చేనేత కార్మికులను దత్తత తీసుకుంటా
- నేతన్నలకు వెన్నుదన్నుగా.. అండగా నిలుస్తాం
- చేనేత కార్మికుల సమస్యలపై ఈనెల 16న సమీక్ష సమావేశం
- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** చేనేత రంగానికి జవసత్వాలు తీసుకుని వచ్చి పూర్వ వైభవం తీసుకొచ్చి, వారి బతుకులు వెలుగులు ప్రసరింప జేస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. గురువారం స్థానిక మండల పరిధిలోని ఆదివారపు పేట గ్రామంలో 11 వ జాతీయ చేనేత దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట చేనేత కార్మికుల కష్టాలు విన్న మంత్రి స్పందిస్తూ ఆదివారపు పేట, అద్దంపల్లి గ్రామాలకు చెందిన చేనేత కార్మికులను దత్తత తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తో కలిసి మగ్గాల యూనిట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేయబడిన చేనేత రంగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జవసత్వాలు తీసుకొచ్చేందుకు మగ్గానికి 200, మరమగ్గానికి 500 యూనిట్లు విద్యుత్ రాయితీని ప్రకటించడంతో జిల్లాలో 60 లక్షలు రూపాయలు దీని ద్వారా లబ్ధి చేపడు తుందన్నారు. త్రిప్ట్ రుణాలు మంజూరు చేస్తూ ఆప్కో ద్వారా విక్రయాలు మరలా పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టడంతో పాటు, నూలుపై సబ్సిడీ ఇస్తూ చేనేత వస్త్రాల విక్రయాలపై ఐదు శాతం జీఎస్టీ మినహాయింపు కల్పించడం జరిగిందన్నారు. వీటికి అదనంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో నేతన్న నేస్తం కింద మరో రూ.25 వేలు ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 16వ తేదీ చేనేత రంగ మంత్రి సమక్షంలో మరిన్ని సమస్యల పరిష్కారానికై సమావేశం నిర్వహించి తగు నిర్ణయాలు గైకొని, సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. చేనేత కార్మికులు కూటమి ప్రభుత్వానికి వెన్నెముకగా నిలిచారని వారి సంక్షేమానికి అన్ని విధాలుగా ముఖ్య మంత్రి ప్రత్యేక చొరవతో కృషి చేయడం జరుగుతుందన్నారు. ముద్రా రుణాల కింద 90 మంది నేతన్నలకు మంజూరైన రూ.45 లక్షల రుణాల మంజూరు చెక్కును పంపిణీ చేశారు. తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు అలంకరించి అందరికీ జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత రంగానికి సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసి ఏడాది పాటు ఉపాధి కల్పనకై నేతన్నల ఆర్థిక అభివృద్ధికి పథకాల రూ పొందించడం జరిగిందన్నారు. అలాగే 50 ఏళ్ల వయసు పైబడిన నేతన్నలకు రూ.4 వేల పింఛన్ అందిస్తున్నామన్నారు. నూలు కొనుగోలుపై సబ్సిడీ కల్పించడం క్లస్టర్ టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధి వీవర్స్ శాలల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రణాళికా యుతంగా ముందుకు సాగుతుందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో చేనేత వస్త్రాలు వినియోగం పెంచడానికి ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. చేనేత కార్మికుల నైపుణ్యం వెలికి తీసే ఉద్దేశంతో నూతన డిజైన్లు దరఖాస్తులు ప్రభుత్వం ఆహ్వానిస్తుందన్నారు. ఒక జిల్లా ఒకే ఉత్పత్తి పథకానికి సంబంధించి కేంద్రం నుండి 26 అవార్డులకుగాను ఏపీకి 9 అవార్డులు దక్కాయని వాటిలో 4 అవార్డులు చేనేత రంగం సంబంధించిన రావడం గర్వకారణమన్నారు. ఎం ఎస్ ఎం ఈ పార్కులలో నేతన్నలకు ప్రత్యేక యూనిట్లు కేటాయించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాకతో చేనేతల బతుకుల్లో వెలుగులు వస్తున్నాయని తెలిపారు. ఏడాది కాలం నుంచి నేతన్నలు తమ కాళ్ల మీద తామే నిలబడి, గౌరవ ప్రదమైన జీవనం సాగించేలా బృహత్తర కార్యక్రమాల కు ప్రభుత్వం నాంది పలి కిందన్నారు. ఒకవైపు నేతన్నలకు సంక్షేమ పథకాలు అందిస్తూనే చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ నదుపాయం కల్పించి వారి ఆర్థిక ఉన్నతికి వెన్నుదన్నుగా నిలుస్తోందన్నారు. జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ వ్యవసాయం తరవాత అత్యధిక మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. లక్షలాది మంది చేనేత వస్త్రాల తయారీనే జీవనాధారంగా చేసుకున్నారన్నారు. మానవుడి కనీస అవసరాలు కూడు, గూడు, గుడ్డ అని మనకు తెలుసునని, వ్యవసాయం తర్వాత అతి పెద్ద పరిశ్రమగా చేనేత హస్తకళలకు గుర్తింపు ఉందన్నారు. పుట్టిన నాటి నుండి గిట్టే వరకు మన శరీరం మీద వస్త్రాలు తప్పనిసరన్నారు. మనం ధరించే వస్త్రాలు మన మానసిక, శారీరక, ఆర్థిక, సామాజిక, వ్యక్తిత్వ గుణాల స్థాయిని రుజువు చేస్తాయన్నారు. పంచె కట్టులో పురుషులు, చీరకట్టులో స్త్రీలు అందంగా, హుందాగా, ఆకర్షణీయంగా, సాంప్ర దాయం ఉట్టిపడే విధంగా కనిపిస్తారన్నారు నేతన్న చేతుల్లో మాయాజాలం ఫలితంగా సప్తవర్ణ రంగులు వస్త్రాలకు అందాల విందులు అరబోస్తాయన్నారు . నాడు విదేశీ వస్త్రాలను బహిష్కరించి, స్వదేశీ చేనేత వస్త్రాలను ప్రోత్సహించడానికి సంకేతంగా గాంధీజీ నూలు వడికే రాట్నం ముందు కూర్చొని ప్రచారం చేయడం చూసామన్నారు. నాటి చేనేత వస్త్రాల నుంచి నేటి ఆధునిక సాంకేతిక యంత్రాల వినియోగం వరకు వస్త్ర పరిశ్రమ ఊహించ నంతగా అభివృద్ధి చెంద డం జరిగిందన్నారు. మంగ ళగిరి చీరలు, బెనారస్ వస్త్ర వెలుగులు, ధర్మవరం ధగ ధగలు, కోట చీరల కమనీయాలు, కలంకారీ కళాకాంతుల వస్త్ర రంగులు నేటికీ మనల్ని మంత్ర ముగ్దుల్ని చేస్తూనే ఉన్నాయన్నారు. అనాదిగా గ్రామీణ ప్రజానీకానికి జీవనోపాధిని కల్పిస్తున్న దనీ ఒక దారపు పోగు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపదకు నిదర్శనంగా నిలుస్తున్నద న్నారు. దేశ సామాజిక- ఆర్థిక సుస్థిరాభివృద్ధికి చేనేత పరిశ్రమ ఊతం ఇచ్చిందన్నారు. స్వతంత్ర భారతంలో చేనేత హస్త కళలకు ప్రాధాన్యత చాలా ఎక్కువ న్నారు. నేతన్న కళ్లల్లో సంతోషం వర్షించాలంటే ఆయా కుటుంబాలు ఆర్థికంగా బలపడాలన్నారు. నాటి చేనేత పరిశ్రమ తక్కువ పెట్టుబడి, స్వల్ప శక్తి వినియోగం, కాలంతోపాటు వస్తున్న మార్పులకు అనుగుణంగా తమ డిజై న్లను మార్చడం లాంటివి సానుకూల అంశాలుగా చేసుకొని మార్కెట్లో డిమాండ్ ఉన్న చేనేత వస్త్రాల తయారీపై దృష్టి పెట్టి జీవనోపాదులను మెరుగు పరుచుకోవాలని స్పష్టం చేశారు మన మూలాలను వెతుక్కుంటూ, సదాచారాలను పాటిస్తూ, ఆరోగ్యకర చేనేత వస్త్రాలను ధరిస్తూ, నేతన్న కు బాసటగా నిలవాలన్నారు. ప్రభుత్వం ద్వారా సమకూర్చే సహాయ సహ కారాలను సకాలంలో అందిస్తూ అన్ని విధాలుగా అండగా భరోసాగా నిలుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి ప్రాంతీయ సంచాలకులు ధనుంజయరావు, ఆర్డీవో దేవరకొండ అఖిల, అసిస్టెంట్ డైరెక్టర్ జౌలిశాఖ పెద్దిరాజు, తాసిల్దారు బి.మృత్యుంజయరావు, ఎంపీడీవో పద్మజ్యోతి, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ సొసైటీ సెక్రటరీలు ఏడిఓ లు గుర్రాజు వెంకటేశ్వరరావు, డివో లు గంగరాజు, శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## గండేపల్లి మండలం బిసి సెల్ అధ్యక్షులుగా కారుకొండ శ్రీనివాస్



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** నీలాద్రి రావు పేట గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు బీసీ యాదవ కులానికి చెందిన కారుకొండ శ్రీనివాస్ ను గండేపల్లి మండలం బీసీ సెల్ అధ్యక్షులుగా నియమిం చిన జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బీసీలు అత్యధిక లందరూ తెలుగుదేశం పార్టీ మద్దతుదారులని గండేపల్లి మండలం తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకి జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్‌కి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని గండేపల్లి మండల టిడిపి అధ్యక్షులు పోతుల మోహనరావు, మండల టిడిపి నాయకులు కందుల చిట్టిబాబు, జెడ్ రాగంపేట సొసైటీ చైర్మన్ కందుల కొండయ్య చౌదరి (బాబ్జి), నీలాద్రి రావు పేట టిడిపి అధ్యక్షులు కురుకూరి వీర వెంకట చౌదరి సహకారంతో రేపు రాబోయే 2029 ఎన్నికలలో టిడిపి విజయం సాధించేందుకు ఇప్పటినుంచి కష్టపడి పని చేస్తామని అన్నారు. శ్రీనివాస్‌కి కురుకూరి రమేష్, ఎంపీటీసీ గోవిందు, కట్టు అప్పారావు, దార బల్ల అబ్బు, దేవర సత్తిబాబు, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## దళిత యువకుడిపై దాడి అమానుషం..

- జిల్లా తెదేపా అధ్యక్షురాలు అనంతకుమారి



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు దళితులపై దమనకాండ సాగించిన విధానాన్ని అధికారాన్ని కోల్పోయినా అదే తీరు కొనసాగిస్తోందని డా.బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంత కుమారి అన్నారు.తిరుమల తిరుపతిలో వైసీపీ అనుచరులు ఒక దళిత యువకుడిపై జరిపిన క్రూర దాడిని తీవ్రంగా ఖండించారు.కలియుగ వేంకటేశ్వర స్వామి కొలువైన పవిత్రమైన తిరుమలలో భూమన కరుణాకర్ రెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దౌర్జన్యం మాత్రమే కాదని,ఇది దళిత సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్న వైసీపీ నాయకత్వం చేస్తున్న దమనకాండకు నిలిచే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.కరుణాకర్ రెడ్డి రౌడీయిజం తిరుపతి ప్రజల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని పేర్కొన్నారు.ఈ దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుని, బాధిత దళిత యువకుడికి న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేస్తూ ప్రకటన విడుదల చేశారు.

## ఓకుర్తిలో అరుదైన అటవీ ప్రాణి

- స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని ఓకుర్తి గిరిజన రైతు పొలంలోకి అరుదైన అటవీ ప్రాణి అలుగు(పాంగోలిన్) గురువారం వచ్చింది. ఈ మేరకు ఎఫ్ ఎస్ ఓ హరీఫ్ కు సమాచారం రావడంతో స్థానిక ఎఫ్ ఎస్ ఓ ఉషారాణి ఆధ్వర్యంలో అటవి ప్రాణి అలుగును ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఉన్నత అధికారులు ఆదేశాలు మేరకు గురువారం సాయంత్రం సురక్షిత అటవీ ప్రాంతంలో అలుగును వదిలిపెట్టినట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఉషారాణి స్థానిక విలేకర్లకుతెలిపారు. వైల్డ్ లైఫ్ యాక్ట్ ప్రకారం అడవి జంతువులను వేటాడితే ఎంతటి వారి పైన అయినా చట్ట పరమైనచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎఫ్ ఎస్ ఓ ఉషారాణి హెచ్చరించారు.. అడవి జంతువులను రక్షించడంలో ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. అలానే అటవీ రక్షణకు రాత్రి వేళల్లో గస్తీ నిర్వహిస్తున్నామన్నారు.

# ప్రజల అభిప్రాయాలు కచ్చితంగా తెలుసుకోవాలి

- జిజిహెచ్ అన్న క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రి వద్దనున్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ మరియు కమిషనర్ పి. ప్రశాంతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశాలు వంటి అంశాలను సమీక్షించారు. ఆహారం స్వీకరిస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడి భోజన నాణ్యత, పరిశుభ్రత, వసతుల లభ్యత, సమయ పాలన, టోకెన్ల అందుబాటు తదితర అంశాలపై సమాచారాన్ని అడిగి తెలుసు కున్నారు. క్యాంటీన్ నిర్వహణ విషయంలో ప్రజల నుంచి అభిప్రాయాలు కూడా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా సేకరించవచ్చని ఆమె తెలిపారు.అన్న క్యాంటీన్ల నిర్వహణలో ఎటువంటి లోపాలు ఉండకూడదని, సమయ పాలన కచ్చితంగా పాటించాలని, ప్రజల నుంచి ఆహారం అందకపోయినట్లు ఫిర్యాదులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని అక్షయపాత్ర సంస్థ సిబ్బందికి సూచనలు చేశారు. క్యాంటీన్ల నిర్వహణపై నోడల్ అధికారులపై పూర్తి బాధ్యత వుందని పేర్కొంటూ, నిరంతర పర్యవేక్షణ చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వం ×ు=ూ విధానంలో ప్రజల అభిప్రాయాలు సేకరిస్తోందని, గతంలో ప్రజలు తెలిపిన సూచనలను కూడా పరిగణనలోకి తీసుకుని, అన్న క్యాంటీన్ల సేవల నాణ్యతను మెరుగు పరచాలని తెలిపారు.